సాక్షి
జనగామ
ఆదివారం । 28 । జులై । 2024



నిలకడగా ప్రాణహిత..
మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది నిలకడగా ప్రవహిస్తోంది. వరద నీరు మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీకి చేరుతోంది. - 10లో▸



సీనియారిటీ ప్రకారం పదోన్నతులు
జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పిస్తామని తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు అన్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/25^0$

వాతావరణం
ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అధికశాతం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయి.

న్యూస్‌రీల్

వైభవంగా వారకల్యాణం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవ రెడ్డి, సంగోజు మోహనాచారి– శంకరలక్ష్మి తదితరులు పాల్గొనగా.. ఏర్పాట్లను ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న పర్యవేక్షించారు. కొమ్ముగుట్ట గ్రామానికి చెందిన మిడివెల్లి సంజీవ–జ్యోతి దంపతులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

మట్టి గణపతులనే పూజించాలి



జనగామ రూరల్: రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.సత్తయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన ప్రతిమలను నిమజ్జనం చేస్తే జల కాలుష్యం ఏర్పడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మర్రెడ్డి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అందరికీ అవగాహన ఉండాలి



జనగామ రూరల్: గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్‌తో ప్రాణాలు రక్షించవచ్చు.. దీనిపై అందరికీ అవగాహన ఉండాలని డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్య సిబ్బందికి సీపీఆర్ విధానంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, డీపీఓ వినోద్‌కుమార్, డాక్టర్లు కమల్ హసన్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన పల్లవి



కొడకండ్ల : టీజీఆర్‌ఎస్‌జేసీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న జక్కుల పల్లవి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైంది. శనివారం జనగామ పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పల్లవి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు 20 మంది ఎంపిక



జనగామ రూరల్: పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 14, 16, 18, 20 వయసు బాలబాలికలు 20 మంది వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్ తెలిపారు. వీరంతా ఆగస్టు 7న హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కోశాధికారి అశోక్, శ్రీకిష్టయ్య, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీఆర్‌సీ జిల్లా చైర్మన్‌గా గౌతమ్



చిల్పూరు: చిల్పూరుకు చెందిన గనగోని గౌతమ్ జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) జిల్లా చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ చైర్మన్ శ్రీకాంత్, రాష్ట్ర చైర్మన్ రాజేశ్వర్ ప్రకటించి నియామక పత్రం అందజేశారు.

ముసురుతో సరి..

- చెరువులు, వాగుల్లో చేరని నీరు
- మరింత పడిపోయిన భూగర్భజలాలు
- 1.91లక్షల ఎకరాల్లో పంటల సాగు
- భారీ వర్షాల కోసం రైతన్న ఎదురుచూపు



నీరులేక ఎండిపోయిన నర్మెట మండలంలోని బొమ్మకూర్ రిజర్వాయర్

జనగామ: ఈ ఏడాది వానాకాలం సీజన్ రైతులను టెన్షన్‌కు గురిచేస్తోంది. తొలకరి పలకరింపుతో ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నదాతలు దుక్కులు దున్ని, పొలాలను సిద్ధం చేసి వరి నాట్లు వేసుకున్నారు. మరోవైపు పత్తి సాగు పనులను ముమ్మరం చేశారు. అయితే.. ఇప్పటి వరకు ఒక్క భారీ వర్షం కూడా లేకపోవడం.. చిలకరింపుతోనే వరుణుడు సరిపెట్టడంతో చెరువులు, వాగుల్లో నీరు చేరలేదు. నీటి వినియోగం పెరగడంతో భూగర్భజలాలు మరింత పడిపోయాయి. బోర్లు, బావుల నుంచి చుక్కనీరు రావడంలేదు. మొలక దశలో ఉన్న పంటలకు నీరందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న తరుణంలో.. ముసురు రూపంలో కురుస్తున్న జల్లులు ఊపిరి పోస్తున్నాయి. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటన చేసినప్పటికీ.. జిల్లాలో ఆ దాఖలాలు ఏమీ కనిపించడం లేదు. ఇప్పటికిప్పుడు పంటలకు ఎటువంటి నష్టం లేకున్నా.. పరిస్థితి ఇలాగే ఉంటే సాగు నీటి కష్టాలు తప్పవని రైతులు అంటున్నారు.

ఇప్పటి వరకు 60 శాతమే సాగు..

వానాకాలం సీజన్ జిల్లాలో 3.30 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ముందస్తు అంచాన వేసింది. ఇప్పటి వరకు వరి, పత్తి, కందులు, మొక్కజొన్న, టుబాకో ఇతర పంటలు కలిపి 1.91లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో 83వేల ఎకరాల పైచిలుకు పంటలను



జనగామరూరల్ ప్రాంతంలో సాగు చేసిన వరి

క్రాప్ బుకింగ్ ద్వారా ఆన్‌లైన్ చేశారు.

నీరులేని చెరువులు, రిజర్వాయర్లు

జిల్లాలో 953 చెరువులు, కుంటలు ఉండగా.. వీటి పరిధిలో 68,962 ఎకరాల ఆయకట్టు ఉంది. 526 చెరువుల్లో కేవలం 25 శాతం మాత్రమే నీరు ఉండగా.. 354 చెరువుల్లో 25 నుంచి 50శాతం, 9 చెరువుల్లో 50 నుంచి 75శాతం, 7 చెరువుల్లో 75 నుంచి 100శాతం నీటి నిల్వలు ఉన్నాయి. పాలకుర్తి నియోజకవర్గం పరిధి(జనగామ/మహబూబాబాద్ జిల్లా)లోని 16 చెరువులు మత్తడి పోస్తున్నాయి. జిల్లాలో 7 రిజర్వాయర్లు ఉండగా వాటిలో నీటి లభ్యత మునుపటి పరిస్థితే ఉంది.

జిల్లాలోని రిజర్వాయర్ల నీటి సామర్థ్యం, ప్రస్తుత నిల్వలు(మీటర్లలో)

రిజర్వాయర్	సామర్థ్యం	నిల్వలు	శాతం
గండిరామవరం	422	0.193	48.25
బొమ్మకూరు	475	0.090	45.45
చీటకోడూరు	389	0.125	41.61
నవాబుపేట	328.800	0.102	18.46
ఆర్‌ఎస్.ఘన్‌పూర్	338.215	0.510	32.48
అశ్వరావుపల్లి	400	0.136	18.38
మైలారం	250.500	0.449	51.79

మండలాల వారీగా సాగైన పంటల వివరాలు(ఎకరాల్లో)

మండలం	వరి	మొక్కజొన్న	కందులు	పత్తి
జనగామ	11,250	-	234	1,650
బచ్చన్నపేట	10,261	95	370	1,311
నర్మెట	7,800	201	95	6,800
తరిగొప్పుల	7,000	385	80	9,100
చిల్పూరు	6,725	485	27	2,250
స్టేషన్‌ఘన్‌పూర్	6,650	580	115	6,350
రఘునాథపల్లి	4,200	220	120	17,200
లింగాలఘణపురం	4,500	03	120	16,000
జఫర్‌గఢ్	6,300	115	44	11,725
పాలకుర్తి	4,850	120	-	14,000
దేవరుప్పుల	4,300	02	150	16,000
కొడకండ్ల	3,300	-	200	8,500

పరిస్థితి ఇలాగే ఉంటే నష్టం..



పదిరోజులుగా కురుస్తున్న ముసురు వానలు పత్తికి మేలు చేసినప్పటికీ పరిస్థితి ఇలాగే ఉంటే నష్టం జరిగే ప్రమాదం ఉంది. నాకున్న నాలుగెకరాల్లో పత్తి పంట సాగు చేసిన. పెట్టుబడులకు ఇప్పటి వరకు రూ.80వేలు ఖర్చు చేసిన. ఎడతెరిపి లేని ముసురుతో పత్తి ఎర్రబారి చీడ పీడలు ఆశిస్తున్నాయి.

\- కొంతం జెన్నయ్య, రైతు, తమ్మడపల్లి (జీ), జఫర్‌గఢ్

పంటలకు మేలే..



జిల్లాలో కురుస్తున్న ముసురు వర్షంతో పత్తి, వరి, ఇతర పంటలకు మేలే జరుగుతుంది. నేల తడిసే విధంగా వాన ఉంది. పొలంలో నీరు నిలిచి, వారం రోజుల పాటు బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో మాత్రమే కొంత ఇబ్బంది ఏర్పడుతుంది. ప్రస్తుతం అలాంటి ఇబ్బంది లేదు. వరి పంటకు సరిపోను ముసురు కురుస్తున్నది. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

\- వినోద్‌కుమార్, డీఏఓ

ఫతేషాపూర్‌లో మద్యపాన నిషేధం

- ఎవరైనా అమ్మితే రూ.5 వేల జరిమానా
- గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం



మద్యపాన నిషేధం అమలుపై సమావేశంలో తీర్మానం చేస్తున్న గ్రామస్తులు

రఘునాథపల్లి: పేదల కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న మద్యపానాన్ని నివారించేందుకు ఫతేషాపూర్ గ్రామస్తులు మూకుమ్మడిగా ఒక్కటయ్యారు. గ్రామ స్పెషల్ ఆఫీసర్ కాకి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన గ్రామసభలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామైక్య సంఘాల మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు మద్యపాన నిషేధం అమలుకు నిర్ణయించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి గ్రామంలో పూర్తిగా మద్యపాన నిషేధం అమలు చేయాలని, ఎవరైనా విక్రయిస్తే రూ.5వేల జరిమానా విధించడంతోపాటు ప్రభుత్వ పథకాలు నిలిపి వేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. బెల్ట్ షాపుల నిర్వాహకులను పిలిపించి మూడు రోజుల తర్వాత గ్రామంలో మద్యం విక్రయించవద్దని సూచించారు. గ్రామ సభలో చేసిన తీర్మానంపై మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి గుజ్జుల మహేష్, మాజీ సర్పంచ్ గాజులపాటి మహేందర్, నామాల నాగరాజు, ఎండీ.యాకూబ్, అజయ్, జబ్బార్, ఆనందం, భాస్కర్, అజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి, వీఓఏలు గాజులపాటి రమాదేవి, ఉమ్మగోని విమల, గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు బాల్నె రమ, జిల్లా ఝాన్సీ, గుడి వినోద, జ్యోతి పాల్గొన్నారు.

స్త్రీ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- విజయ డెయిరీ జిల్లా డైరెక్టర్ సత్యనారాయణయాదవ్



డీడీని సన్మానిస్తున్న సొసైటీల అధ్యక్షులు

స్టేషన్‌ఘన్‌పూర్: విజయ డెయిరీకి పాలుపోసే రైతులకు, మహిళా సంఘం సభ్యులైన పాడి రైతులకు ప్రభుత్వం స్త్రీ నిధి పథకం ద్వారా రెండు గేదెలు ఇస్తున్నది.. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజయ డెయిరీ జిల్లా డైరెక్టర్ సత్యనారాయణయాదవ్ అన్నారు. స్థానిక పాలశీతలీకరణ కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఫైళ్లు, రిజిష్టర్లు పరిశీలించిన అనంతరం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల సొసైటీల అధ్యక్షులు, పాడి రైతులు డీడీని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు సంబంధించి బిల్లుల జాప్యం సమస్యను త్వరలో పరిష్కరిస్తామని, సబ్సిడీలు తొందరగా వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కృష్ణాజీగూడెం, శివునిపల్లి, రాఘవపూర్ సొసైటీల అధ్యక్షులు సాదం రమేష్, లక్ష్మీనారాయణ, కుమారస్వామి, జిల్లా మేనేజర్ కె.హరికృష్ణ, శివప్రసాద్, ఘన్‌పూర్ మేనేజర్ జి.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

- జిల్లా ఉద్యాన అధికారి కేఆర్.లత



ఆయిల్‌పామ్ మొక్క నాటిన అధికారి లత

బచ్చన్నపేట : ఆయిల్‌పామ్ తోటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి కేఆర్.లత అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోచన్నపేటలో రైతులు చింతల విజయలక్ష్మి, అపర్ణ, రమ్య వ్యవసాయ భూముల్లోని ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌లో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో తోటలు సాగు చేసుకోవచ్చని, నాలుగేళ్ల తరువాత ఆదాయం మొదలై దాదాపు 30 సంవత్సరాల పాటు వస్తుందన్నారు. ప్రభుత్వం మొక్కలను సబ్సిడీపై అందజేస్తుందని, ఆసక్తి, అవసరం ఉన్న రైతులు మండల ఉద్యాన అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌పామ్ జిల్లా ఇన్‌చార్జ్ హదస్స, హార్టికల్చర్ అధికారి రవికాంత్, ఏఈఓ హారిక, ఫీల్డ్ ఆఫీసర్ శశి, రైతులు జనార్ధన్‌రెడ్డి, కానుగంటి బాలచందర్, మల్లేష్, నారాయణ, బాలయ్య, శివరాములు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కుక్కల పట్టివేత షురూ..

- కోర్టు ఆవరణ నుంచి మొదలు
- చంపక్‌హిల్స్ ఏబీసీ సెంటర్‌కు తరలింపు
- ఆపరేషన్ తర్వాత ఎక్కడి శునకాలక్కడే..

సాక్షి ఎఫెక్ట్..



పట్టుకున్న కుక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు

జనగామ: పట్టణంలో కుక్కలను పట్టుకోవడం మొదలు పెట్టారు. విచక్షణా రహిత దాడులతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న గ్రామ సింహాలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. కుక్కకాటు బాధితులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ‘శునకం... భయానకం’ శీర్షికన ఈనెల 27న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మేనేజర్ రాములు, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు ఆధ్వర్యాన హైదరాబాద్ నుంచి వచ్చిన ఐదుగురి బృందం శనివారం జిల్లా కోర్టు ఆవరణ నుంచి కుక్కలను పట్టుకోవడం ప్రారంభించింది. పసరమడ్ల శివారు చంపక్‌హిల్స్ డంపింగ్ యార్డు సమీపాన రూ.30లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌కు తరలించి అక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్, వ్యాక్సినేషన్ చేయనున్నారు. ఆపరేషన్ తర్వాత వారం రోజులు కుక్కలను అక్కడే ఉంచి అనంతరం ఎక్కడి నుంచి తీసుకువచ్చారో అక్కడే వదిలేస్తారు. జిల్లా కేంద్రంలో ఉన్న కుక్కలను విడతల వారీగా పట్టుకోనున్నారు. దీంతో పట్టణ ప్రజలకు శునకాల భయం నుంచి ఉపశమనం కలుగ నుంది.

మొక్కలు జీవవైవిధ్యాన్ని పెంచుతాయి

- జిల్లా విద్యాధికారి కె.రాము



పాఠశాలలో మొక్క నాటుతున్న డీఈఓ రాము

జనగామ రూరల్: మొక్కలు పర్యావరణాన్ని రక్షించి జీవవైవిధ్యాన్ని పెంచుతాయని జిల్లా విద్యాధికారి కె.రాము అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఓబుల్‌కేశ్వాపూర్ జెడ్పీఎస్‌ఎస్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటిన అనంతరం ఆయన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల్లో విరివిగా మొక్కలు నాటాలని, వాటి ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించవచ్చని చెప్పారు. హిందీ భాషపై మాట్లాడుతూ.. విద్యార్థులకు మాతృభాషతో పాటు హిందీలో నైపుణ్యం పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏఎంఓ శ్రీనివాస్, హెచ్‌ఎం వీరాంజనీ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

- జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్



రైతులకు సూచనలు ఇస్తున్న డీఏఓ వినోద్‌కుమార్

రఘునాథపల్లి: రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధి శ్రీమన్నారాయణపురం రైతులతో రుణమాఫీపై గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఎంత రుణం తీసుకున్నారు.. వడ్డీతో కలిసి ఎంత మాఫీ అయిందనే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పంటల సాగు విధానం గురించి వివరించారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. ఎరువులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈఓ సుస్మిత, రైతులు మాచర్ల శ్రీనివాస్, కొమురాజీ, రాంనర్సయ్య, భిక్షపతి, యాదగిరి, సిద్దిరెడ్డి, మహేందర్, వీరస్వామి, భాస్కర్, శ్రీను, సత్తయ్య, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ ఉపాధికి ప్రోత్సాహం

- చేప పిల్లల పెంపకంతో ఆదాయం
- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవకాశం
- రూ.4.50 లక్షల వ్యయంతో యూనిట్
- ఎస్సీ కార్పొరేషన్ నుంచి రూ.2.25 లక్షలు, నాబార్డ్ నుంచి రూ.50వేల సబ్సిడీ
- బ్యాంకు రుణంగా రూ.1.75 లక్షలు



లింగాలఘణపురం: మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులకు వ్యవసాయ అనుబంధంగా ఉపాధి పొందేందుకు పీఎంఈజీపీ పథకంతో అవకాశం కల్పిస్తున్నారు. ఉదయ్ ఆక్వా కనెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్.. నాబార్డ్ సహకారంతో ఎస్సీ కార్పొరేషన్ నుంచి చేప పిల్లల పెంపకం చేపట్టేందుకు సబ్సిడీతో కూడిన రుణం ఇవ్వనుంది. పీఎంఈజీపై పథకానికి సంబంధించి సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్(సీఎస్‌ఏ) ద్వారా చేపల పెంపకం, మార్కెటింగ్‌కు రూ.4.50 లక్షలతో జీవనోపాధి యూనిట్లను సెర్ప్–డీఆర్‌డీఏ నుంచి అమలు చేయనుంది. అందులో ఎస్సీ కార్పొరేషన్ నుంచి 50 శాతం సబ్సిడీ రూ.2.25 లక్షలు, నాబార్డ్ నుంచి రూ.50వేల సబ్సిడీతో పాటు, రూ.1.75 లక్షల బ్యాంకు రుణంగా ఇవ్వనుంది.

1,25,716 మంది సభ్యులు

జిల్లాలో 466 వీఓలు ఉండగా 11,201 ఎస్‌హెచ్‌జీ గ్రూపులున్నాయి. మొత్తం సభ్యులు 1,25,716 మంది ఉన్నారు. సభ్యుల్లో ఎస్సీలు 29,811, ఎస్టీలు 15,393. బీసీలు 72,076, మైనారిటీలు 1677, ఓసీలు 6756, ఇతరులు ముగ్గురు ఉన్నారు. వీరిలో నిరుపేదలు 31,125, పేదలు 93,043 మంది.

చేప పిల్లల పెంపకం.. విధి విధానాలు

చేప పిల్లల పెంపకం చేపట్టే మహిళా సంఘం సభ్యురాలికి 20 గుంటల భూమితో పాటు బోరు తప్పనిసరిగా ఉండాలి. చేప పిల్లల పెంపకంతో పాటు వ్యవసాయం, కూరగాయల సాగు రెండో అనుబంధ ఉపాధిగా ఉండాలి. చేప పిల్లల పెంపకం నుంచి వచ్చే నీటిని కూరగాయల సాగుకు వినియోగించాలి. దీంతో ఎలాంటి పురుగు మందులు వాడాల్సి అవసరం ఉండదు. దీనికి పీవీసీ ట్యాంక్‌తో పాటు పాండ్ ఉండాలి. పీవీసీ ట్యాంక్‌లో 5 గ్రాముల నుంచి 4 నెలల పాటు.. పాండ్‌లో 500 గ్రాముల నుంచి 1000 గ్రాముల వరకు పెంచిన చేపలను స్థానిక మార్కెట్‌లో లేదా ఉదయ్ ఆక్వా వారికి విక్రయించవచ్చు. చేప పిల్లల పెంపకం యూనిట్‌కు లబ్ధిదారులు 10 శాతం వాటా ధనం చెల్లించాల్సి ఉంటుంది. హ్యాచరీస్‌లోని చేప పిల్లలనే ఇస్తారు. వాటి సంరక్షణ, రైతులకు అవగాహన, సమావేశాలు నిర్వహించడం, చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అవసరమైతే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తారు. చేప పిల్లల పెంపకం షెడ్ ఉదయ్ ఆక్వా ఆధ్వర్యంలో ఉచితంగా నిర్మిస్తారు. ఆసక్తి ఉన్న ఎస్‌హెచ్‌జీ సంఘం సభ్యులతో యూనిట్ నిర్వహణ బాధ్యతను ఏపీఎంలకు అప్పగిస్తారు.

ఎంపిక ప్రక్రియ మొదలు..



చేప పిల్లల పెంపకం యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక మొదలైంది. మండలాల ఏపీఎంలు ఆసక్తి ఉన్న సభ్యుల వివరాలు తీసుకుంటున్నారు. ఎస్సీలకు 50 శాతం సబ్సిడీ, బీసీలు, ఇతరులకు లేదు. ఉదయ్ ఆక్వా కనెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారే శిక్షణ, పెంపకం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తారు.

\- శ్రీనివాస్, అడిషనల్ డీఆర్‌డీఓ, జనగామ

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి సుచరిత



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సుచరిత

జనగామ రూరల్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత అన్నారు. ర్యాగింగ్ నిషేధ చట్టంపై ఏబీవీ జూనియర్ కళాశాలలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, పిల్లల భవిష్యత్ పాడవుతుందన్నారు. ఈ సందర్భంగా పోక్సో యాక్ట్–2012పై వివరించారు. బాలికలు చదువుపై శ్రద్ధ పెట్టాలని, ఒంటరిగా దూర ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి సూచించారు. చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రవీంద్ర, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోత్స్న, శ్రీహరి, కళాశాల ప్రిన్సిపాల్ కనకరాజు పాల్గొన్నారు.

రూ.1.80 లక్షలు రికవరీ

- 2019లో ఆధార్ అప్‌డేట్ పేరిట మోసం
- కోర్టు కేసుతో విసిగిపోయి ఐదేళ్ల తరువాత తిరిగి చెల్లింపు



బాధితులకు రికవరీ డబ్బులు అందజేస్తున్న పులి యాకయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఆధార్ అప్‌డేట్ పేరిట ఓ వ్యక్తి చేతిలో మోసపోయిన నమిలిగొండ గ్రామస్తులకు ఐదేళ్ల అనంతరం డబ్బులు రికవరీ అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సీతారాంపూర్‌కు చెందిన అలువాల వినయ్ 2019లో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండ జీపీ కార్యాలయంలో ఆధార్‌కార్డు అప్‌డేట్ ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశాడు. సవరణ, అప్‌డేట్ పేరుతో గ్రామస్తుల ఆధార్‌కార్డులతో బ్యాంకు ఖాతాల నుంచి ఒక్కొక్కరి వద్ద వారికి తెలియకుండా రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు తీసుకున్నాడు. నాలుగైదు రోజులు క్యాంపు నిర్వహించి మొత్తం 285 మంది నుంచి రూ.1.80 లక్షలు కాజేశాడు. తర్వాత ఉడాయించాడు. పది రోజుల అనంతరం విషయం తెలుసుకున్న బాధితులు అప్పటి ఎంపీటీసీ, ప్రస్తుత కాంగ్రెస్ నాయకుడు పులి యాకయ్య సాయంతో ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ రాజిరెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఐదేళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్న వినయ్.. విసిగిపోయి బాధితులతో రాజీ కుదుర్చుకున్నాడు. తాను తీసుకున్న డబ్బులు చెల్లించడానికి అంగీకరించాడు. దీంతో యాకయ్య ఆధ్వర్యంలో శనివారం బాధితులకు డబ్బులు ముట్టజెప్పాడు. మాజీ సర్పంచ్ ద్యేగల ఉప్పలస్వామి, కందుకూరి ప్రవీణ్, భానుచందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

- ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు అమలు



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లను విజయవాడ సెక్షన్‌లో రైల్వే ఇంజినీరింగ్ పనుల కారణంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. సికింద్రాబాద్–గుంటూరు గోల్కొండ, సికింద్రాబాద్–విజయవాడ శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లను అప్ అండ్ డౌన్ మార్గంలో ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ రద్దును ప్రయాణికులు గమనించాలని కోరారు.

రైల్వే విజిలెన్స్ అధికారుల తనిఖీ

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ పరిధిలో సికింద్రాబాద్ రైల్వే విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. కాజీపేట జంక్షన్ పరిధిలో గల రైల్వే క్రాసింగ్ గేట్ల వద్దకు వెళ్లి వాటి పనితీరు, గేట్‌మన్ల అప్రమత్తత, రాత్రి, పగలు విధుల పనితీరు, పరికరాలను తనిఖీ చేసినట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే గేట్ల వద్ద తనిఖీ చేసిన అధికారులు గేట్‌మన్ల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా కాజీపేట జంక్షన్ పరిధిలో కొంత మంది రైల్వే అధికారులు .. సిబ్బందిని తమ ఇళ్లలో సొంత పనులకు ఉపయోగించుకుంటున్నారనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

11వాహనాలు సీజ్

- రూ.3.75 లక్షల జరిమానా



సీజ్ చేసిన లారీలు

హసన్‌పర్తి: యాదాద్రి–ఆరెపల్లి జాతీయ రహదారి మార్గమధ్యలోని కోమటిపల్లి టోల్ గేట్ వద్ద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, గనులు, రాష్ట్ర పన్నుల విభాగం, ఆర్టీఏ అధికారులు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న 11 వాహనాలను గుర్తించారు. ఏడు ఇసుక లారీలు, డోలమైట్, గ్రానైట్ బ్లాక్ లారీలు ఒక్కొక్కటి, రెండు ఫ్లైయాష్ లారీలను సీజ్ చేశారు. రూ.3.75 లక్షల జరిమానా విధించారు.సీజ్ చేసిన లారీలను ఆర్టీఏ కార్యాలయానికి తరలించినట్లు అధికారులు చెప్పారు. మోటార్ వెహికిల్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్.. కావొద్దు విషాదం

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

- వర్షాకాలంలో పొంచి ఉన్న ముప్పు
- ఆదమరిస్తే అంతే.. ప్రాణాలు గాల్లోకి..
- తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకొద్దు



విద్యుత్ సబ్ స్టేషన్

హన్మకొండ: విద్యుత్.. విషాదం కావొద్దు. వినియోగదారులు, రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం ఆదమరిచినా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో తరచూ విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తుంటాయి. తడి దుస్తులు ఆరేస్తూ, మోటార్లు ఆన్ చేస్తూ, మరమ్మతుల సమయంలో విద్యుత్ తీగలు పట్టుకుని, తెగిన తీగల కారణంగా తరచూ పలువురు చనిపోతున్నారు. అలాగే, తెగిన విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు తక్కువ ఎత్తులో ఉండడంతో పశువులు కూడా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. దీనికి కారణం విద్యుత్ సిబ్బంది భద్రతా చర్యలు, ఎల్‌సీల్లో నిబంధనలు పాటించకపోవడమేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ సంస్థల యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలని సూచించినా సిబ్బంది వాటిని విస్మరించి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటూ ఆయా కుటుంబాలను దుఃఖసాగరంలో ముంచుతున్నారు.

65 సబ్ స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా

హనుమకొండ జిల్లాలో 65 విద్యుత్ సబ్ స్టేషన్లు, 11,123 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. జిల్లాలో మొత్తం 4,41,252 మంది విద్యుత్ వినియోగదారులున్నారు. ఇందులో 3,27,020 మంది గృహ విద్యుత్ వినియోగదారులు, 64,204 మంది వ్యవసాయ విద్యుత్ వినియోగదారులున్నారు. వీరితో పాటు మిగతా వినియోగదారులున్నారు.

అప్రమత్తతే ఆయుధం

అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పొలాల వద్ద రైతులు, ఇళ్లలో కుటుంబీకులు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు కురుస్తున్న సమయంలో గోడలు, నేల, విద్యుత్ స్తంభాలు తేమతో నిండి ఉంటాయి. ఈ తేమతో ప్రమాదాలు జరుగుతాయి. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న స్తంభాల నుంచి నేల, గోడలు, ఇతర వస్తువులకు విద్యుత్ ప్రవాహం జరిగి విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశముంది. ఏ మాత్రం ఏమరు పాటు వహించిన ప్రాణాలు పోవడం ఖాయం. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా విద్యుదాఘాతానికి గురికాకుండా ఉండొచ్చు.

వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వర్షం కురుస్తున్న సమయంలో, కురిసిన తర్వాత తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు, సపోర్టు వైరు, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకొద్దు.
- దండెం వైర్లు, విద్యుత్ వైర్లను కలపొద్దు. సపోర్ట్ వైర్లుగా ఇన్సులేటెడ్ జీ.ఐ వైర్లను ఉపయోగించాలి.
- ప్రజలు, వినియోగదారులు విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సర్వీస్ వైర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వాటిని తాకకుండా దూరంగా నడవాలి.
- ఓల్టేజీలో హెచ్చు తగ్గులున్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్ అధికారులకు తెలపాలి.
- వర్షాలతో చెట్లు లేదా కొమ్మలు విద్యుత్ వైర్లకు తాకి షాక్ వచ్చే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి. వాటిని తాకకుండా విద్యుత్ అధికారులకు తెలపాలి.
- వ్యవసాయ నిమిత్తం, గృహాలలో అతుకులు లేని సర్వీస్ వైరును మాత్రమే ఉపయోగించాలి.
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దు. వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలపాలి.
- ఎవరికైనా కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరలోని వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలనే అత్రుతతో ముట్టుకోవద్దు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులు వాడడమే సరైన పరిష్కారం.
- ముఖ్యంగా రైతులు వ్యవసాయ పంపుసెట్లను వాడుతున్నప్పుడు కరెంట్ మోటార్లకు కాని, పైపులను కాని, ఫుట్ వాల్వ్‌లను కాని ఏమర పాటుతో తాకొద్దు. వ్యవసాయ పంపు సెట్లను , స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి. విద్యుత్ ప్రమాదాలు ఎర్త్ చేయబడని పరికరాల వల్లే జరుగుతాయి. ఎర్త్ చేయబడని మోటార్లు, స్టార్టర్లు, జీ.ఐ పైపులు, ఫుట్ వాల్వ్‌లు తాకడం అత్యంత ప్రమాదకరం.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- మోటారు పంపుసెట్లకు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే సొంతంగా సరిచేద్దామని ప్రయత్నిస్తే ప్రాణనష్టం, హాని జరగొచ్చు. మోటారు రిపేరు తెలిసిన వారితోనే చేయించాలి.
- గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బంది లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్లను సంప్రదించి వారి సేవలు పొందాలి.
- విద్యుత్ పరికరాలు, వైరింగ్, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ గుర్తింపు కలిగినవి వాడాలి.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులు అప్రమపత్తంగా ఉండాలి. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వినియోగదారులు మరింత జాగ్రత్తగా ఉండాలి. విద్యుత్ సమస్యలు వస్తే ఏఈ, సిబ్బందికి తెలపాలి. ప్రతి నెల జారీ చేసే బిల్ కమ్ నోటీస్‌పై ఏఈ, లైన్‌మెన్ ఫోన్ నంబర్ ఉంటుంది. వినియోగదారులు సొంతంగా మరమ్మతులు చేయకుండా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి వారితోనే సమస్యను పరిష్కరించుకోవాలి.

కె.వెంకటరమణ, ఎస్ఈ హనుమకొండ సర్కిల్

పొలానికి నీరుపారించడానికి వెళ్లి మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో రైతు మృతి
- కోనాపురంలో ఘటన

చెన్నారావుపేట: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని కోనాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తుమ్మలపెల్లి రాజిరెడ్డి(50) గ్రామ శివారులోని తన పొలం వద్దకు వెళ్లాడు. ఇటీవల నాటు వేయడంతో పొలం మడుల్లో నీరు పారించడానికి విద్యుత్ మోటార్ వద్దకు వెళ్లాడు. మోటార్ పనిచేయకపోవడంతో విద్యుత్ స్తంభానికి తగిలించిన తీగలను సరి చేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక విద్యుత్ తీగ ఊడి మీద పడడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఏఎస్సై లక్ష్మణమూర్తి ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు. కాగా, మృతుడికి భార్య పద్మ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



రాజిరెడ్డి (ఫైల్)

సీనియారిటీ ప్రకారం పదోన్నతులు

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పిస్తామని తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ మొదటి మహాజన సభ జరిగింది. ఈ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు అధికారుల సేవలు తమకు ఎంతో సంతృప్తి కలిగిస్తున్నాయన్నారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చన్నారు. పాలక వర్గంతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా బ్యాంకుల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య, డీసీసీబీ మహబూబ్‌నగర్ చైర్మన్ వెంకటయ్య, ఆదిలాబాద్ చైర్మన్ బోజా రెడ్డి, మెదక్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, తెలంగాణ డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి సర్వేశ్వర రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, అసోసియేషన్ సభ్యులు ప్రభాకర్, ఉదయశ్రీ, కురువ నాయక్, అజయ్ రెడ్డి, చందర్ రావు, విశ్వేశ్వర్, స్రవంతి, కృష్ణ ప్రసాద్, శైలజ, అజయ్ పాల్గొన్నారు.

నిలకడగా ప్రాణహిత నది

- కాళేశ్వరం వద్ద 10.500 మీటర్ల ఎత్తులో ప్రవాహం
- మేడిగడ్డకు 8,85,795 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



కాళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత, గోదావరి నదులు

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది నిలకడగా ప్రవహిస్తోంది. శనివారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి పుష్కరఘాట్‌ను తాకుతూ 10.500మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. దీంతో వరద నీరు దిగువన అంబట్‌పల్లిలోని మేడిగడ్డ(లక్ష్మీ)బరాజ్‌కు చేరుతోంది. అక్కడ బరాజ్‌లోకి 8,85,795 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నప్పటికీ అన్నారం బరాజ్ వద్ద 14వేల క్యూసెక్కులు మాత్రమే తరలివస్తోంది. బరాజ్‌లోని 66గేట్లు ఎత్తినీటిని దిగువకు తరలిస్తున్నారు.

డిగ్రీ అధ్యాపకుల బదిలీ ప్రక్రియ

- 1,010 అధ్యాపకుల ఖాళీలు
- శనివారం అర్ధరాత్రి వరకు వెబ్‌ఆప్షన్లు
- ఒకటి, రెండ్రోజుల్లో బదిలీ ఉత్తర్వులు

విద్యారణ్యపురి : రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల బదిలీలకు విద్యాక మిషనర్ ఇటీవల షెడ్యూల్ విడుదల చేశారు. ఇందులో మల్టీజోన్–1పరిధిలో సబ్జెక్టుల వారీగా 1,010 మంది అధ్యాపక ఖాళీల జాబితాను రూపొందించారు. అందులో క్లియర్ వేకెన్సీలు 561గాను, 449 తప్పనిసరిగా బదిలీ కావాల్సినవిగా చూపారు. అభ్యంతరాలు కూడా స్వీకరించారు. శనివారం అర్ధరాత్రి వరకు బదిలీ ప్రక్రియకు అధ్యాపకులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించారు. ఐదేళ్లు ఒకేచోట పనిచేసినవారు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తులు చేసుకున్నారు. మల్టీజోన్–1 పరిధిలో హనుమకొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, నిర్మల్, మెదక్, కొమురం భీం, కరీంనగర్, ఆదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల పరిధిలో కళాశాలలకు అన్ని సబ్జెక్టుల అధ్యాపకులకు బదిలీలకు అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా ఎన్‌సీసీ బాధ్యతలు నిర్వర్తించే అధ్యాపకుల బదిలీలను శనివారం హైదరాబాద్‌లో ఫిజికల్ కౌన్సెలింగ్ నిర్వహించారు.10 మంది అధ్యాపకుల వరకు బదిలీ అయ్యారని సమాచారం. వీరికి కూడా త్వరలోనే ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 214 ఖాళీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 214 వరకు అధ్యాపకుల ఖాళీలు చూపారని సమాచారం. హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 116, వరంగల్ జిల్లాలో 31, మహబూబాబాద్‌లో 36, ములుగులో 16, జయశంకర్ భూపాలపల్లిలో 15 ఖాళీలు చూపారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసిన ఎక్కువమంది అధ్యాపకులు పట్టణ ప్రాంత కాలేజీలకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఒకటి, రెండ్రోజుల్లో అధ్యాపకులకు ఆర్డర్స్ ఇవ్వనున్నారు. ఈనెల 31 చివరి గడువు ఉండగా, బదిలీ ఆర్డర్స్ వచ్చిన వెంటనే తమకు కేటాయించిన కళాశాలల్లో జాయిన్ కావాల్సి ఉంటుంది.

ప్రిన్సిపాల్ పోస్టుల ఖాళీలు..

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బదిలీలకు 62 ప్రిన్సిపాల్స్ పోస్టులు వేకెన్సీలుగా చూపారు. అందులో క్లియర్ వేకెన్సీలు 39, తప్పనిసరిగా బదిలీలు 23 ఉన్నాయి. రాష్ట్రస్థాయి పోస్టు కావడంతో దరఖాస్తు చేసిన ప్రిన్సిపాల్స్ సీనియారిటీ జాబితా వెల్లడించారు. వీరికి కూడా వెబ్‌ఆప్షన్లను పెట్టుకునే అవకాశం కల్పించారు.

విద్యుత్ ఉద్యోగుల సాహసం

- కుంటలో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
- అభినందించిన టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



కుంటలోని విద్యుత్ స్తంభంపై ఎక్కుతున్న విద్యుత్ అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులు సాహసం చేశారు. కుంటలో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. హసన్‌పర్తి చింత గట్టు నుంచి పలివేల్పుల వైపునకు వచ్చే 11 కేవీ వ్యవసాయ ఫీడర్‌లో విద్యుత్ అంతరాయం కలిగింది. అంతరాయాన్ని గుర్తిస్తూ వస్తున్న క్రమంలో పలివేల్పుల కుంట మధ్యలో నుంచి వెళ్లిన విద్యుత్ స్తంభంపై ఏదైనా లోపం ఏర్పడొచ్చనే ఆలోచన వచ్చింది. అనుకున్నదే తడవుగా ఎన్పీడీసీఎల్ నయీంనగర్ ఏఈ అరుణ్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది శనివారం పలివేల్పుల కుంట వద్దకు చేరుకున్నారు. విద్యుత్ అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు బానోతు శ్రీను, మునిపల్లి శ్రీను ఈదుకుంటూ వెళ్లి స్తంభం జారుతున్నా అతి కష్టంపై ఎక్కారు. ఇన్సులేటర్ ఫెయిల్ (ఫంక్చర్) కావడం గుర్తించారు. అనంతరం సమస్యను సరి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, లైన్ ఇన్‌స్పెక్టర్ సుగుణాగర్, కుమారస్వామి, లైన్‌మెన్ కోటి పాల్గొన్నారు.

నా భర్తను మానసికంగా వేధించి చంపేశారు

- పోలీసులను ఆశ్రయించిన మృతుడి భార్య
- పోలీసుల అదుపులో నిందితుడు?

రామన్నపేట : అప్పు ఇవ్వకపోతే ఇంట్లోకి చొరబడి చితకబాదడమే కాకుండా మానసికంగా వేధించి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడేలా చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం.. వరంగల్ పోతన నగర్‌కు చెందిన వీరగంటి రమేశ్(66), రమాదేవి దంపతులు తాపీ మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రమేశ్.. కరీమాబాద్‌కు చెందిన తుంగళ్ల దేవేందర్, తుమ్మ రాజు వద్ద కొంత అప్పు చేశాడు. ఈ క్రమంలో దేవేందర్, రాజు తమ డబ్బులు ఎప్పుడు చెల్లిస్తావని పేర్కొంటూ రమేశ్‌ను 22వ తేదీన సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అనుసరించారు. రాత్రి ఇంటికి వెళ్లినా చొరబడి రమేశ్‌తో పాటు అతడి భార్య రమాదేవిపై కూడా దాడికి పాల్పడ్డారు. అనంతరం 23వ తేదీన సాయంత్రం రమేశ్ పెద్ద కొడుకు వీరగంటి రాజును సైతం దేవేందర్, రాజు తరఫు వ్యక్తులు బెదిరించి దూషించారు. దీంతో ఈ ఘటనలపై రమేశ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. 24వ తేదీన రాత్రి ఎప్పటి లాగే నిద్రించాడు. 25వ తేదీ ఉదయం రమేశ్ నోటి నుంచి నురుగు వచ్చిన విషయం గమనించి కుటుంబీకులు వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించగా అదే రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పోలీసులు.. దేవేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారని సమాచారం.

ఆర్థిక ఇబ్బందులు.. ఉద్యోగం పర్మనెంట్ కాదేమోనని..


పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

తొర్రూరు: ఉద్యోగం పర్మనెంట్ కాదేమోనని ఒకవైపు, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో గ్రామ పంచాయతీ కార్యదర్శి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం...పట్టణానికి చెందిన పేర్ల చిన్న భిక్షం, గండెమ్మ దంపతుల కుమారుడు వెంకన్న(32) దంతాలపల్లి మండలం లక్ష్మీపురంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దానికితోడు ఉద్యోగం పర్మనెంట్ కాకపోవడంతో మనస్తాపానికి లోనయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన వెంకన్న శనివారం పట్టణ శివారు కంఠాయపాలెం రోడ్డులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గజ ఈతగాళ్లు, వర్ధన్నపేట అగ్నిమాపక సిబ్బంది సహాయంతో పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి భార్య లక్ష్మి, రెండేళ్ల వయసున్న కూతురు హర్షిత ఉన్నారు. ప్రస్తుతం లక్ష్మి ఏడు నెలల గర్భిణి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.

పాలకుర్తి మండల కేంద్రంలో ఫర్టిలైజర్ వ్యాపారి..



సోమశేఖర్ (ఫైల్)

పాలకుర్తి టౌన్ : ఆర్థిక ఇబ్బందులతో ఫర్టిలైజర్ వ్యాపారి శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పాలకుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిప్రసన్నకుమార్ కథనం ప్రకారం.. పాలకుర్తికి చెందిన సలేంద్ర సోమశేఖర్(32) మండల కేంద్రంలో నాలుగు సంవత్సరాల నుంచి ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపులో ఆర్థికంగా నష్టం రావడంతో దంపతుల మధ్య గొడవలు జరిగాయి. దీనికి మనస్తాపం చెందిన సోమశేఖర్.. శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమశేఖర్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎరువుల కంపెనీల డీలర్ల ఒత్తిళ్లతో..

ఫర్టిలైజర్ షాపు నిర్వహణకు సోమశేఖర్ రూ. 20 లక్షల పెట్టుబడి పెట్టాడు. రైతులకు ఎరువులు, పురుగుల మందులు ఉద్దెర ఇవ్వడం.. వారు సకాలంలో డబ్బు చెల్లించకపోడంతో పలు కంపెనీల నిర్వాహకులు సోమశేఖర్‌పై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని ఓ కంపెనీ.. సోమశేఖర్ షాపులో నిల్వ ఉన్న స్టాక్‌ను తీసుకెళ్లింది. ఎరువుల కంపెనీల డీలర్లు నిత్యం డబ్బుల కోసం రావడంతో దంపతుల మధ్య జరిగిన గొడవలు సోమశేఖర్ ఆత్మహత్యకు దారి తీశాయని సమాచారం. కాగా, మండల కేంద్రంలో సోమశేఖర్ చిత్రపటానికి ఫర్టిలైజర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు అడ్డూరి భూపాల్‌రావు, కార్యదర్శి బత్తుల వెంకన్న, సభ్యులు దొడ్డ మధు, రాపాక సంతోష్, హరీశ్, మామిండ్ల శోభన్‌బాబు, శివ నివాళులర్పించారు.

లోక్యతండాలో యువరైతు..



సాంబయ్య (ఫైల్)

వేలేరు: అప్పులబాధతో ఓ యువరైతు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలం లోక్య తండా గ్రామంలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. లోక్య తండా గ్రామానికి చెందిన మురావత్ సాంబయ్య (34) ఉన్న రెండు ఎకరాల్లో వరి, పత్తి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24న తన కొడుకు ఆరోగ్యం బాగలేకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అడ్మిట్ చేసి చికిత్స చేయిస్తున్నాడు. ఇందుకు రూ.2.50 లక్షల వరకు అప్పు తెచ్చాడు. సాగుకు తెచ్చిన అప్పులు అప్పటికే రూ.3.50లక్షలు ఉన్నాయి. కొడుకు ఆరోగ్యం బాగాలేకపోవడం, గతేడాది పంటలు సరిగా పండక చేసిన అప్పులు తీర్చేమార్గం లేక శుక్రవారం మధ్యాహ్నం సమయంలో వ్యవసాయబావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి తన చెల్లెకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆమె వెంటనే వారి బంధువులకు సమాచారం ఇవ్వగా బావివద్దకు వెళ్లి చూసేసరికి చేనులో పడిపోయి ఉన్నాడు. వెంటనే అక్కడికి వెళ్లిన వారు 108కి సమాచారం అందించగా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేలేరు ఎస్సై హరిత శనివారం తెలిపారు.